


# కరపత్రం

SINCE 2014

శుక్రవారం సెప్టెంబర్ట్ 04, 2026 | సంపుటి : 2 | సంచిక : 324 | - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ | పేజీలు :4



# నన్ను బెదిరిస్తే భయపడను

## స్నేహంతోనే నన్ను గెలవగలరు

- నేను ఎవరికీ గులామ్‌ను కాదు.. దోస్తీకి మాత్రమే
- ఓల్డ్ సిటీ కాదు.. ఒరిజినల్ సిటీ
- పాతబస్తీ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది
- మీరాలం ట్యాంక్‌పై రూ.500 కోట్లతో కేబుల్ బ్రిడ్జి
- పాతబస్తీ మెట్రోను పూర్తిచేసి తీరుతాం
- నాలాల ఆక్రమణల తొలగింపుతో ముంపు సమస్యకు చెక్
- పేదల ఇళ్లు తొలగిస్తే ఇందిరమ్మ ఇళ్లతో ఆదుకుంటాం
- హైదరాబాద్ అభివృద్ధికి సహకరిస్తాం.. అసదుద్దీన్ ఒవైసీ



స్నేహంతోనే నన్ను గెలవగలరు. నేను ఎవరికీ గులామ్‌ను కాదు.. దోస్తీకి మాత్రమే గులామ్‌ను. ఎన్నికలు వస్తుంటాయి.. పోతుంటాయి.. గెలుపోటములు సహజం" అని రేవంత్ వ్యాఖ్యానించారు.

**హైదరాబాద్:**
తననెవరూ బెదిరించవద్దని.. బెదిరిస్తే భయపడనని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. పాతబస్తీలోని నల్గొండ ఎక్స్ రోడ్డు నుంచి ఒవైసీ జంక్షన్ వరకు నిర్మించిన భారీ స్టీల్ ఫ్లైఓవర్‌ను సీఎం ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన సభలో మంత్రులు పొన్నం ప్రభాకర్, అజారుద్దీన్, ఎంఐఎం అధ్యక్షుడు, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ, ఇతర ప్రజాప్రతినిధులతో కలిసి సీఎం పాల్గొని మాట్లాడారు. "బెదిరిస్తే భయపడను.

**ఓల్డ్ సిటీ కాదు.. ఒరిజినల్ సిటీ**
ఈ వంతెన నిర్మాణానికి గత ప్రభుత్వం సకాలంలో నిధులు ఇవ్వలేదని సీఎం విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిధులు విడుదల చేసి త్వరగా వంతెన పూర్తిచేసిందని చెప్పారు. తమ ప్రాంత అభివృద్ధి కోసం అసదుద్దీన్ ఒవైసీ ప్రభుత్వంతో పోరాటానికైనా సిద్ధంగా ఉంటారన్నారు. "ఈ ప్రాంతమంతా ఓల్డ్ సిటీ కాదు.. ఇది ఒరిజినల్ సిటీ.

2లో..

# బీజేపీ నేతలు సమాధానం చెప్పాల్సిందే

- రాష్ట్ర ప్రభుత్వంపై విమర్శలు కాదు.. ఢిల్లీకి వెళ్లి మోదీని నిలదీయండి
- తెలంగాణ ప్రయోజనాలపై బీజేపీకి చిత్తశుద్ధి ఉందా?
- పెండింగ్ నిధులు, ప్రాజెక్టులపై కేంద్రాన్ని ఎందుకు ప్రశ్నించరు?
- మెట్రో, నవోదయ, కేంద్రీయ విద్యాలయాలకు అనుమతులు ఎప్పుడు?
- రీజినల్ రింగ్ రోడ్డుకు కేంద్రం నిధులు ఇవ్వాలి
- పన్నుల వాటాలో తెలంగాణకు న్యాయం చేయాలి
- బీజేపీ పాలిత రాష్ట్రాలకు ఇచ్చినట్లే తెలంగాణకూ నిధులు ఇవ్వాలి
- ప్రతిపక్షంగా నిర్మాణాత్మకంగా వ్యవహరించాలి
- తెలంగాణ హక్కుల కోసం పోరాడే దమ్ము చూపించండి: పొన్నం



2లో..

**హైదరాబాద్:**
తెలంగాణలో బీజేపీ నేతలు తమ పార్టీలో నెలకొన్న అంతర్గత పోరులో ఉనికిని కాపాడుకోవడానికే ఒకరిని మించి ఒకరు కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారని మంత్రి పొన్నం ప్రభాకర్ మండిపడ్డారు. నిజంగా తెలంగాణ ప్రయోజనాలపై బీజేపీ నేతలకు చిత్తశుద్ధి ఉంటే రాష్ట్ర ప్రభుత్వాన్ని విమర్శించడం కాకుండా ఢిల్లీకి వెళ్లి ప్రధానమంత్రి నరేంద్ర మోదీని నిలదీయాలని ఆయన డిమాండ్ చేశారు.
తెలంగాణ ప్రయోజనాల కోసం కేంద్రం నుంచి రావాల్సిన నిధులు, పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులు, అనుమతులపై బీజేపీ నేతలు ఎందుకు మాట్లాడటం లేదంటూ ప్రశ్నించారు. రాష్ట్రానికి రావాల్సిన నిధుల కోసం కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాల్సిన బాధ్యత తెలంగాణ బీజేపీ నేతలపై ఉందన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో కేంద్రం నుంచి నిధులు, ప్రాజెక్టులు ఏ విధంగా మంజూరవుతున్నాయో తెలంగాణ విషయంలో ఎందుకు అదే విధానం అమలు కావడం లేదో బీజేపీ నేతలు సమాధానం చెప్పాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శిస్తేనే తమ ఉనికిని కాపాడుకోగలమని, పార్టీ అధిష్ఠానం తమను గుర్తిస్తుందని భావించడం సరికాదన్నారు.
ప్రతిపక్ష పార్టీగా నిర్మాణాత్మకంగా వ్యవహరించాల్సిన బీజేపీ నేతలు కేవలం రాజకీయ విమర్శలకే పరిమితం కాకుండా తెలంగాణ హక్కుల కోసం కేంద్రాన్ని ప్రశ్నించాలన్నారు. గతంలో పదేళ్ల పాటు రాష్ట్రంలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం అనేక బకాయిలు పెట్టినప్పుడు బీజేపీ నేతలు ఎందుకు ప్రశ్నించలేదని మంత్రి పొన్నం ప్రభాకర్ నిలదీశారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఎప్పటికప్పుడు చెల్లింపులు చేస్తూ, పాత బకాయిలను కూడా పరిష్కరించే దిశగా ముందుకు సాగుతోందన్నారు.

# కవితకు ఢిల్లీ హైకోర్టు నోటీసులు

- 'ది పయనీర్' పత్రిక వ్యవహారంలో నోటీసులు
- పరువు నష్టం ఆరోపణలు చేయొద్దని కోర్టు ఆదేశం
- కవితతో పాటు మరో 14 మందిపై ఆంక్షలు
- జర్నలిస్టులు, యూట్యూబ్ ఛానళ్లు, డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లకు కూడా నోటీసులు

2 లో

**ఢిల్లీ:**
'ది పయనీర్' పత్రిక వ్యవహారంలో తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవితకు ఢిల్లీ హైకోర్టు నోటీసులు జారీ చేసింది. ఆ పత్రికపై పరువు నష్టం ఆరోపణలు చేయొద్దని ఆమెను ఆదేశించింది. కవితతో పాటు మరో 14 మంది జర్నలిస్టులు, యూట్యూబ్ ఛానళ్లు, డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లపైనా కోర్టు ఆంక్షలు విధించింది.





# టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ అరెస్ట్.. ఆస్తులు చూస్తే కళ్లు బైర్లు కమ్మాల్సిందే!

**సూర్యాపేట:**
సూర్యాపేట టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ సోమయ్యను ఏసీబీ అధికారులు అరెస్ట్ చేశారు. ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టారనే ఆరోపణలు, ఫిర్యాదుల నేపథ్యంలో ఏసీబీ అధికారులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# సురేఖ బర్తరఫ్..

## కొండా మురళి సంచలన ట్వీట్

- » ఇదేం కొత్త కాదు.. ఇవాళ మేము.. రేపు ఎవరో
- » పదవులు ఉన్నా లేకున్నా మా గౌరవం మాకు ఉంటుంది
- » ఉన్నది ఉన్నట్టు మాట్లాడితే ఎవరూ తట్టుకోలేరు
- » అన్నీ గమనిస్తూనే ఉంటాం.. ప్రతిదానికి స్పందించకపోవచ్చు
- » సురేఖ బర్తరఫ్‌కు గవర్నర్ ఆమోదం
- » సీఎం రేవంత్‌తో గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా భేటీ
- » సురేఖ బర్తరఫ్, కేబినెట్ విస్తరణపై చర్చ
- » మీడియా ముందు మీసం మెలేసిన కొండా మురళి

**హైదరాబాద్:**
కొండా సురేఖ భర్త మురళి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. మాకు ఇదేం కొత్త కాదన్న మురళి.. ఇవాళ మేము.. రేపు ఎవరో? అంటూ వ్యాఖ్యానించారు. పదవులు ఉన్నా లేకున్నా మా గౌరవం మాకు ఉంటుంది. మేం ప్రతిదానికి స్పందించకపోవచ్చు..




2లో..



## సురేఖ బర్తరఫ్ స్వయంకృతాపరాధమే

- సీఎంకు బ్లాక్‌మెయిల్ చేయాల్సిన అవసరమేంటి?: ఆది శ్రీనివాస్
- కుటుంబ సభ్యులను అదుపులో పెట్టుకోవడంలో సురేఖ విఫలం
- రేవంత్‌పై పదేపదే విమర్శలు చేసి పార్టీని బలహీనపర్చే యత్నం
- సురేఖకు కాంగ్రెస్, ప్రభుత్వం ఎన్నో అవకాశాలు ఇచ్చాయి
- అవకాశాలను సద్వినియోగం చేసుకోకుండా పదేపదే తప్పులు
- సురేఖ వ్యవహారశైలిని అధిష్ఠానం సమగ్రంగా పరిశీలించింది
- క్రమశిక్షణారాహిత్యాన్ని సహించబోమని స్పష్టం

02

# ఒక్క పోటుతో.. చిన్నారెడ్డి ఫస్ట్ రియాక్షన్



2 లో

**వనపర్తి:**
పదవిపై తనకు వ్యామోహం లేదని కాంగ్రెస్ సీనియర్ నేత జిల్లెల చిన్నారెడ్డి అన్నారు. తెలంగాణ ప్రణాళిక సంఘం ఉపాధ్యక్ష పదవి నుంచి తనను తొలగించడం పట్ల ఆయన స్పందిస్తూ.. సీఎంను కలవలేదు. కలవాలనే ప్రయత్నం చేయలేదన్నారు. కష్టపడి ఈ స్థాయికి వస్తే.. ఒక్క పోటుతో కూల్చేశారు.



# డంపింగ్ యార్డుగా మారిన నదిని శుభ్రం చేసి.. సామాజిక స్పృహ చాటి!

- డంపింగ్ యార్డుగా మారిన నదికి విముక్తి
- అజ్జార్ నదిని ఒంటిచేత్తో శుభ్రం చేసిన యువకుడు
- ఈత రాకపోయినా వెనక్కి తగ్గని బిట్టూ
- ప్లాస్టిక్ వ్యర్థాల తొలగింపుతో నదికి కొత్త రూపు
- వ్యర్థాలను కంపోస్టుగా మార్చిన పర్యావరణ ప్రేమికుడు
- నది శుభ్రత కోసం సొంతంగా రూ.30 వేల ఖర్చు
- స్నేహితులతో కలిసి పరికరాలు, చెత్త డబ్బాల కొనుగోలు
- బిట్టూ సేవలకు ఆనంద్ మహీంద్రా ప్రశంసలు
- యువతకు ఆదర్శంగా నిలిచిన సామాజిక స్పృహ

సాధారణంగా డిగ్రీ చదివే విద్యార్థులు స్నేహితులతో కాలక్షేపం, పరీక్షలు, భవిష్యత్తు కార్యాచరణకే ఎక్కువ సమయం కేటాయిస్తుంటారు. కానీ, ఓ డిగ్రీ విద్యార్థి మాత్రం తన ఆలోచనలను పర్యావరణ పరిరక్షణ వైపు మళ్లించాడు. కాలుష్యం బారినపడిన ఓ నదిలో కొంత భాగం శుభ్రం చేసేందుకు ఉపక్రమించిన అతడు.. ఒంటి చేత్తో శుభ్రం చేసి శభాష్ అనిపించుకున్నాడు. అతడి సామాజిక స్పృహకు సంబంధించిన కథనాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.

02



# స్మార్ట్ రేషన్ కార్డులపై ఒక ఊరి పేరు బదులు మరో ఊరి పేరు.. గందరగోళంపై లబ్దిదారుల గరంగరం

**కామారెడ్డి:**
కామారెడ్డి జిల్లాలో స్మార్ట్ రేషన్ కార్డుల గందరగోళం నెలకొంది. స్మార్ట్ రేషన్ కార్డుల్లో ఊర్ల పేరు తారుమారు కావడంతో కన్ఫ్యూజన్ క్రియేట్ అయింది.

2లో..

# హైకమాండ్‌ను సీఎం రేవంత్ బ్లాక్‌మెయిల్ చేశారు: కొండా సురేఖ



2లో..

**హైదరాబాద్:**
తనను మంత్రివర్గం నుంచి తొలగించాలంటూ సీఎం రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ హైకమాండ్‌ను బ్లాక్‌మెయిల్ చేశారని మంత్రి కొండా సురేఖ ఆరోపించారు. ఆమెను బర్తరఫ్ చేయాలంటూ గవర్నర్‌కు సీఎం లేఖ పంపిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో కొండా సురేఖ మీడియా సమావేశం నిర్వహించారు. "నా వివరణ తీసుకోకుండా బర్తరఫ్ నిర్ణయం తీసుకున్నారు. ఉరిశిక్ష పడిన ముద్దాయిని కూడా చివరి కోరిక ఏంటని అడుగుతారు. ఏ తప్పు చేయకపోయినా.. ఎందుకు చేస్తున్నామో చెప్పకుండా నన్ను బర్తరఫ్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నా.

కరపత్రం
తెలుగు దిన పత్రిక
శుక్రవారం సెప్టెంబర్ట్ 04, 2026

# హైకమాండ్‌ను సీఎం రేవంత్ బ్లాక్‌మెయిల్ చేశారు: కొండా సురేఖ

మొదటిపేజీ తరువాయి

మంత్రి పదవి నుంచి నన్ను తొలగించే ఉద్దేశం కాంగ్రెస్ హైకమాండ్‌కు లేదు. ఆ విషయం నాకు వంద శాతం తెలుసు. కానీ.. సీఎం రేవంత్‌రెడ్డి హైకమాండ్‌ను బ్లాక్‌మెయిల్ చేశారు. ఆమెను మంత్రి పదవి నుంచి తొలగిస్తారా? నన్ను రాజీనామా చేయమంటారా? అని సీఎం బెదిరించారు. నాతో పాటు మాజీ ఓఎస్డీ సుమంత్‌పై కుట్ర చేశారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో పాటు ఎంపీ వేం నరేందర్‌రెడ్డి, సీఎం సోదరులు కొండల్‌రెడ్డి, తిరుపతిరెడ్డి కక్షగట్టారు. నాకు తెలియకుండా సుమంత్‌ను తప్పించారు. పోలీసులపై ఒత్తిడి తెచ్చి ఆయన కుటుంబాన్ని ఇబ్బంది పెడుతున్నారు.

### నేను తప్పు చేయలేదు.. అవమానంగా భావించను

నాపై చర్యలకు సిఫార్సు చేసిన క్రమశిక్షణ కమిటీ ఛైర్మన్ మల్లు రవి కూడా గతంలో కాంగ్రెస్‌ను తిట్టినవారే. గతంలో రోశయ్య, జైపాల్‌రెడ్డి కూడా ఇందిరాగాంధీని దూషించారు. మంత్రి పదవి నుంచి తొలగించినందుకు నేనేమీ బాధపడట్లేదు. నేను తప్పుచేయలేదు.. బర్తరఫ్‌ను అవమానంగా భావించడం లేదు. మేం ప్రజాబలం ఉన్న నాయకులం.. జనం మా వెంటే ఉంటారు. మంత్రులు, ఎమ్మెల్యేలూ.. మీరు సంతోషంగా ఉన్నారా?గుండెల మీద చేయి వేసుకుని చెప్పాలి. బయటకు వచ్చి మీ బాధలు చెప్పుకోండి. ప్రజాప్రతినిధులకే పనులు జరగని పరిస్థితి నెలకొంది.

### కాంగ్రెస్‌కు రాజీనామా చేసే ఆలోచన లేదు

హామీలు నెరవేర్చకపోవడం వల్ల ప్రజల్లో వ్యతిరేకత వస్తోంది. క్షేత్రస్థాయి పరిస్థితిపై ప్రభుత్వం సర్వే చేయించుకుంటే మంచిది. ఇప్పటికైనా అందరూ బయటకు వచ్చి ధైర్యంగా మాట్లాడాలి. పనులు జరగాలంటే ఎవరి వద్దకు వెళ్లాలో తెలియని స్థితిలో ఎమ్మెల్యేలు ఉన్నారు. ప్రజలకు సేవ, ప్రాంతాన్ని అభివృద్ధి చేయలేకపోతున్నామనే బాధ అందరిలోనూ ఉంది. బర్తరఫ్‌పై పునరాలోచించుకోమని చెప్పను.. పార్టీ తీరు మారాల్సిన అవసరముంది. మళ్లీ కాంగ్రెస్ పార్టీ గెలవాలంటే చాలా మార్పులు చేసుకోవాలి. రేవంత్‌రెడ్డి ఏకపక్షంగా వ్యవహరించడం సరికాదు. నావైపు ఒక వేలు చూపితే.. రేవంత్ వైపు నాలుగువేళ్లు చూపుతాయి. ప్లాన్-బిపై ఇంకా ఏమీ ఆలోచించుకోలేదు. ఎమ్మెల్యేగా కొనసాగుతా. కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసే ఆలోచన లేదు" అని కొండా సురేఖ అన్నారు.

# డంపింగ్ యార్డుగా మారిన నదిని శుభ్రం చేసి.. సామాజిక స్పృహ చాటి!

మొదటిపేజీ తరువాయి

మధ్యప్రదేశ్‌లోని రాజ్‌గఢ్ జిల్లా బియోరా పట్టణానికి చెందిన బిట్టూ తబాహి డిగ్రీ చదువుతున్నాడు. స్థానికంగా ప్రవహించే అజ్నార్ నదిలో ఓ చోట భారీ స్థాయిలో చెత్త పేరుకుపోవడాన్ని గమనించాడు. ప్లాస్టిక్ వ్యర్థాలతో డంపింగ్ యార్డుగా కనిపిస్తోన్న నదిని చూసి ఎలాగైనా శుభ్రం చేయాలని నిశ్చయించుకున్నాడు. ఈ ఏడాది జనవరి 26న రంగంలోకి దిగాడు. అతడికి ఈత కూడా రాదు. గ్లౌజ్‌లు, బూట్లు లేకపోయినా వ్యర్థాలు తొలగించే పని మొదలుపెట్టాడు.

కొన్ని రోజులకే బిట్టూ చేతులతోపాటు తోడుగా వచ్చిన ఓ మిత్రుడి కాళ్లకూ ఇన్‌ఫెక్షన్ సోకింది. దీంతో కుటుంబీకులు ఇలాంటి పనులు వద్దని సూచించారు. అయినా బిట్టూ వెనకడుగు వేయలేదు. అందులోని వ్యర్థాలను బయటకు తీసి కంపోస్టుగా మార్చాడు. స్నేహితులతో కలిసి నగదు సేకరించి వ్యర్థాలను తొలగించేందుకు అవసరమైన పరికరాలు, చెత్త డబ్బాలను కొనుగోలు చేశాడు. బురదనూ తొలగించాడు. కొన్ని నెలల్లోనే ఆ నది శుభ్రంగా మారిపోయింది. ఇందుకోసం దాదాపు రూ.30వేలు ఖర్చు పెట్టాడట. యువకుడు చేసిన ఈ ప్రయత్నాలు కొన్ని రోజుల్లోనే సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.

ఈ యువకుడి గురించి ఆనంద్ మహీంద్రా కూడా ఓసారి ప్రస్తావించారు. విమర్శలు వచ్చినప్పటికీ సామాజిక స్పృహ కనబరుస్తూ ఎందరికో స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నాడంటూ కొనియాడారు. ఇదిలాఉంటే, బిట్టు ఇంటిపేరు తబాహి.. అంటే హిందీలో విధ్వంసం, వినాశనం అని అర్థం. అందుకు అనుగుణంగానే కాలుష్యాన్ని నాశనం చేయడమే తన ఆశయమని, ఏళ్లుగా నిర్లక్ష్యానికి గురైన నదిని పునరుద్ధరించడాన్ని లక్ష్యంగా పెట్టుకున్నానని బిట్టూ చెప్పడం విశేషం.

# సురేఖ బర్తరఫ్.. కొండా మురళి సంచలన ట్వీట్

మొదటిపేజీ తరువాయి

కానీ అన్నీ గమనిస్తూనే ఉంటాం. ఉన్నది ఉన్నట్టు మాట్లాడితే ఎవరూ తట్టుకోలేరు" అంటూ కొండా మురళి ట్వీట్ చేశారు. అంతకుముందు హైదరాబాద్‌లోని తన నివాసంలో మీడియా ముందు కొచ్చిన కొండా మురళి.. మీసం మెలేశారు.

హైదరాబాద్ లోక్‌భవన్‌లో గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి భేటీ అయ్యారు. సీఎంతో పాటు లోక్‌భవన్‌కు పలువురు క్యాబినెట్ మంత్రులు వెళ్లారు. కొండా సురేఖ బర్తరఫ్, క్యాబినెట్ విస్తరణ తదితర అంశాలపై గవర్నర్‌కు సీఎం వివరించారు. గవర్నర్‌తో సుమారు 30 నిమిషాల పాటు సమావేశమయ్యారు. కొండా సురేఖ బర్తరఫ్‌కు గవర్నర్ ఆమోదం తెలిపారు.ఇదేం కొత్త కాదు, ఉన్నది ఉన్నట్టు, కుండా బద్దలు కొట్టినట్టు మాట్లాడుతే ఎవ్వరు తట్టుకోరు! ఇవ్వాళ మేము, రేపు ఎవ్వరో.పదవులు ఉన్నా లేకున్న మా గౌరవం మాకు ఉంటుంది.

# నన్ను బెదిరిస్తే భయపడను

మొదటిపేజీ తరువాయి

పాతబస్తీలో అణువణువూ నాకు తెలుసు. మీరాలం ట్యాంక్‌పై రూ.500 కోట్లతో కేబుల్ బ్రిడ్జి నిర్మిస్తున్నాం. అది పూర్తయితే పర్యాటకంగా, రవాణాపరంగా ఎంతో ప్రయోజనం చేకూరుతుంది. ఇప్పటికే ఆరాంఘర్, మూసారాంబాగ్ వంతెనల నిర్మాణం పూర్తిచేశాం. పాతబస్తీ మెట్రోను పూర్తిచేస్తామని చెప్పాం.. చేసి చూపిస్తాం. నాలాలపై ఆక్రమణలను తొలగించి మురుగు సమస్య లేకుండా చేస్తాం. ఎక్కడైనా పేదల ఇళ్లు తొలగిస్తే.. ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చి ఆదుకుంటాం. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ఇంటికి 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తోంది. ప్రతి నెలా రేషన్‌కార్డులపై సన్నబియ్యం పంపిణీ చేస్తున్నాం"అని రేవంత్ అన్నారు.

### రేవంత్‌ను చూసి కాంగ్రెస్‌కు మద్దతు: అసదుద్దీన్

అంతకుముందు అసదుద్దీన్ ఒవైసీ మాట్లాడుతూ హైదరాబాద్ అభివృద్ధికి అన్నివిధాలుగా సహకరిస్తామని చెప్పారు. సీఎం రేవంత్ నేతృత్వంలో రాష్ట్రం అన్ని విధాలుగా అభివృద్ధి చెందాలన్నారు. రేవంత్‌ను చూసి కాంగ్రెస్‌కు మద్దతిస్తున్నామని వ్యాఖ్యానించారు. ఆయన తనదైన పంథాలో పరిపాలన చేయాలన్నారు.

# టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ అరెస్ట్.. ఆస్తులు చూస్తే కళ్లు బైర్లు కమ్మాల్సిందే!

మొదటిపేజీ తరువాయి

ఆయన ఇళ్లలో గురువారం సోదాలు చేపట్టారు. సోమయ్య కార్యాలయంతో పాటు బంధువులు, అనుచరులకు చెందిన 7 ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు. సోదాల్లో భారీగా ఆస్తుల డాక్యుమెంట్లు, నగదు, బంగారం, వెండి స్వాధీనం చేసుకున్నారు.

సోమయ్యకు చెందిన 3 ఎకరాల 3 గుంటల వ్యవసాయ భూమి, సూర్యాపేట, హయత్‌నగర్ పరిధిలో 5 రెసిడెన్షియల్ ప్రాపర్టీలను గుర్తించారు. వీటిలో జీం1, జీం2, జీం4ంపెంట్‌హౌస్ భవనాలతో పాటు రెండు గ్రౌండ్‌ఫ్లోర్ ఇళ్లు ఉన్నాయి. 8 ఓపెన్ ప్లాట్లు, రూ.4.63 లక్షల నగదు, బ్యాంకు ఖాతాల్లో రూ.13 లక్షల బ్యాలెన్స్, 709 గ్రాముల బంగారం, 1,750 గ్రాముల వెండి, రెండు కార్లు, మూడు ద్విచక్ర వాహనాలు, ఇంట్లో రూ.11 లక్షల విలువైన గృహోపకరణాలు, ఎలక్ట్రానిక్ వస్తువులు, బ్యాంకులో 66 తులాల బంగారం తాకట్టు పెట్టి రూ.49 లక్షల గోల్డ్ లోన్ ఉన్నట్లు గుర్తించారు. ఏసీబీ లెక్కల ప్రకారం మొత్తం ఆస్తుల విలువ రూ.3,54,36,490 అని తేల్చారు. బహిరంగ మార్కెట్‌లో వీటి విలువ భారీగా ఉండొచ్చని అధికారులు అంచనా వేశారు. సోమయ్య ఆస్తులపై ఏసీబీ మరింత లోతుగా విచారణ కొనసాగిస్తోంది. నిందితుడిని హైదరాబాద్‌లోని ఏసీబీ ప్రత్యేక కోర్టులో హాజరుపరచనున్నారు.

# సీఎంకు బ్లాక్‌మెయిల్ చేయాల్సిన అవసరమేంటి?: ఆది శ్రీనివాస్

మొదటిపేజీ తరువాయి

మంత్రి పదవి నుంచి కొండా సురేఖ బర్తరఫ్ ఆమె స్వయం కృతాపరాధమని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. ఆమెకు కాంగ్రెస్ పార్టీ, ప్రభుత్వం అనేక అవకాశాలు ఇచ్చినట్లు చెప్పారు. ఈ మేరకు ఆయన ఓ వీడియో విడుదల చేశారు.

"కుటుంబ సభ్యులను కొండా సురేఖ అదుపులో పెట్టుకోలేకపోయారు. ఈ విషయంలో ఆమె విఫలమయ్యారు. సీఎం రేవంత్ రెడ్డి పై పదేపదే విమర్శలు చేసి ప్రభుత్వాన్ని, పార్టీని బలహీనపర్చే ప్రయత్నం చేశారు. కొండా సురేఖ వ్యవహార శైలిని ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే, అగ్రనేతలు సోనియా, రాహుల్, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ సమగ్రంగా పరిశీలించారు. క్రమశిక్షణారాహిత్యాన్ని సహించవద్దనే ఈ నిర్ణయం తీసుకున్నారు. అధిష్ఠానాన్ని సీఎం రేవంత్ బ్లాక్‌మెయిల్ చేశారని కొండా సురేఖ అబద్ధాలు చెబుతున్నారు. సీఎంకు ఆ అవసరమేంటి?

ఆమెకు ఇచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోలేదు. పదే పదే తప్పులు చేశారు. ముఖ్యమంత్రిపై కుటుంబసభ్యులు తీవ్ర ఆరోపణలు చేస్తుంటే కనీసం వారించలేదు. గతంలోనూ ఇలాంటి వ్యాఖ్యలు చేస్తే సీఎం సర్దుకుపోయారు. ఇప్పుడు కూడా నోటికొచ్చినట్లు మాట్లాడినా సీఎం ఎక్కడా బయటపడలేదు. సోనియా, రాహుల్‌పై గౌరవముంటే కాంగ్రెస్‌ను బలహీనపర్చే పనులు ఎందుకు చేశారు? కొండా సురేఖతో పాటు సీనియర్ నేత చిన్నారెడ్డిని కూడా పదవి నుంచి తప్పించారు. సీఎంకు చిన్నారెడ్డి చాలా ఇష్టమైన నాయకుడు. కానీ పార్టీకి నష్టం కలిగిస్తే ఎవరైనా ఒక్కటేనని సీఎం రేవంత్ భావించారు. పార్టీ, ప్రభుత్వాన్ని బలహీనపర్చే చర్యలను ఉపేక్షించబోమని అధిష్ఠానం స్పష్టం చేసింది" అని ఆది శ్రీనివాస్ అన్నారు.

# బీజేపీ నేతలు సమాధానం చెప్పాల్సిందే

మొదటిపేజీ తరువాయి

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు 13 సంవత్సరాలు అవుతున్నప్పటికీ తెలంగాణకు రావాల్సిన అనేక హామీలు, నిధులు, ప్రాజెక్టులు ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయని మంత్రి అన్నారు. ఫెడరల్ వ్యవస్థలో రాష్ట్రాలకు రావాల్సిన పన్నుల వాటాలో తెలంగాణకు న్యాయం జరగాలని కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం కేంద్రాన్ని డిమాండ్ చేస్తోందన్నారు. రాష్ట్రం నుంచి పన్నుల రూపంలో పెద్ద మొత్తంలో ఆదాయం కేంద్రానికి వెళ్తున్నప్పటికీ, తిరిగి రాష్ట్రానికి రావాల్సిన నిధుల విషయంలో తెలంగాణకు అన్యాయం జరగకుండా చూడాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందన్నారు.

తెలంగాణకు పెండింగ్‌లో ఉన్న మెట్రో రైల్, నవోదయ విద్యాలయాలు, కేంద్ర పాఠశాలలు, రీజినల్ రింగ్ రోడ్‌కు సంబంధించిన అంశాలు సహా రాష్ట్ర అభివృద్ధికి సంబంధించిన అన్ని పెండింగ్ ప్రాజెక్టులకు కేంద్రం వెంటనే అనుమతులు, నిధులు మంజూరు చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ డిమాండ్ చేశారు.

తెలంగాణ ప్రజల ప్రయోజనాల కోసం కేంద్రం వద్ద రాష్ట్ర హక్కులను సాధించడంలో బీజేపీ నేతలు ముందుకు రావాలని, అవసరమైతే ప్రధానమంత్రి నరేంద్ర మోదీని కలిసి రాష్ట్రానికి రావాల్సిన నిధులు, ప్రాజెక్టులపై స్పష్టమైన హామీ తీసుకురావాలని మంత్రి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వాన్ని విమర్శించడం కాదు.. తెలంగాణ కోసం ఢిల్లీకి వెళ్లి కేంద్రాన్ని ప్రశ్నించండి. తెలంగాణ ప్రజల ప్రయోజనాల కోసం పోరాడే దమ్ము చూపించండి అని మంత్రి పొన్నం ప్రభాకర్ బీజేపీ నేతలకు సవాల్ విసిరారు.

# ఒక్క పోటుతో.. చిన్నారెడ్డి ఫస్ట్ రియాక్షన్

మొదటిపేజీ తరువాయి

నేను ఎవరిపైనా వ్యక్తిగత విమర్శలు చేయలేదు. కార్యకర్తలు నా దృష్టికి తీసుకొచ్చినా అంశాలనే మాట్లాడా అంటూ ఆయన వివరణ ఇచ్చారు.

పదవి ఉన్నా, లేకున్నా నా గౌరవం నాకుంది.. భవిష్యత్ కార్యాచరణపై ఇంకా నిర్ణయం తీసుకోలేదని చిన్నారెడ్డి అన్నారు. తన వర్గీయులను ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి రావొద్దని.. వస్తే మెడలు పట్టి గెంటేస్తానని ఎమ్మెల్యే అంటున్నారని తనతో కార్యకర్తలు ఆవేదన వెలిబుచుకున్న సందర్భంలో మాత్రమే అలా మాట్లాడానని తెలిపారు.

# స్మార్ట్ రేషన్ కార్డులపై ఒక ఊరి పేరు బదులు మరో ఊరి పేరు.. గందరగోళంపై లబ్దిదారుల గరంగరం

మొదటిపేజీ తరువాయి

సుమారు 3 వేల రేషన్ కార్డులు తప్పుల తడకగా ఉన్నాయి.మాచారెడ్డి,రామారెడ్డి పల్వంచ మండలాలలో లబ్ధిదారులకు పంపిణీ చేసిన స్మార్ట్ రేషన్ కార్డులలో ఓ ఊరు పేరుకు బదులుగా మరో ఊరు పేరు ఉండటమే ఇందుకు కారణం. ఇస్రోజీవాడి గ్రామంలో 501 కుటుంబాల గాను 499 రేషన్ కార్డులు మంజూరు అయ్యాయి.

గ్రామంలోని పంపిణీ చేసిన అన్ని రేషన్ కార్డులో ఇస్రోజీవాడి గ్రామం పేరు బదులు ఉగ్రవాయి గ్రామంగా ప్రింట్ అయి ఉంది. పిన్ కోడ్ నెంబర్ 503144కు బదులు 503111 గా ప్రింటింగ్ అయింది. చిన్న మల్లారెడ్డి గ్రామంలో 400 రేషన్ కార్డులపై చిన్న మల్లారెడ్డి గ్రామంకు బదులు చిన్న చేగురు గ్రామంగా ప్రింటింగ్ అయింది. రామారెడ్డి మండలంలో అన్నారం గ్రామంకు బదులు మద్దికుంట గ్రామంగా 605 కార్డులు ప్రింటింగ్ అయింది.

కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని రామేశ్వర్ పల్లి గ్రామంకు బదులు రామ్ రెడ్డి పల్లిగా 400 రేషన్ కార్డులపై ప్రింటింగ్ అవడంతో గ్రామస్తులు విస్తుపోయారు. పల్వంచ మండలంలోని పోతారం, బండ రామేశ్వర్ పల్లి గ్రామాలలో గ్రామాల పేరుకు బదులు పల్వంచ గ్రామంగా ప్రింటింగ్ అయింది. ఊరు పేర్లు తారుమారు కావడంతో గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు.

ఆధార్ కార్డుపై ఓ ఊరి పేరు, రేషన్ కార్డుపై మరో ఊరు పేరు ఉండటంతో భవిష్యత్తులో సంక్షేమ పథకాలు అందవేమోనని భయాందోళన వ్యక్తం చేశారు. సుమారుగా 3 వేల రేషన్ కార్డుల విషయంలో తప్పులు జరిగినట్లుగా అధికారులు ప్రాథమికంగా గుర్తించారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించాలని లబ్ధిదారులు డిమాండ్ చేశారు.

# మోదీ కోసం ఆ గిఫ్ట్ ఇద్దామనుకున్నా.. కానీ!: బెల్జియం ప్రధాని



భారత పర్యటనకు విచ్చేసిన బెల్జియం ప్రధాని బార్ట్ డి వెవర్ ప్రధాని నరేంద్ర మోదీకి ఓ అరుదైన కానుక ఇవ్వాలనుకున్నారు. బెల్జియంలోని అత్యుత్తమ చాక్లెట్‌తో ప్రత్యేకంగా రూపొందించిన ఇండియా గేట్ ప్రతిరూపాన్ని బహుమతిగా తీసుకొచ్చారు. అయితే, భారత్‌కు చేరుకునేలోపే అనుకోని ఇబ్బంది ఎదురవ్వడంతో.. ప్రయాణ సమయంలోనే ఆ సున్నితమైన చాక్లెట్ శిల్పం కరిగిపోయింది. దీంతో ఈ అపురూప కానుకను ఆయన మోదీకి అందించలేకపోయారు. ఎంతో ప్రత్యేకంగా సిద్ధం చేసిన కానుక ఇలా మార్గమధ్యంలోనే పాడైపోవడంతో ఆయన నిరాశ చెందారు. మరో ప్రతిరూపం బెల్జియంలో సిద్ధంగా ఉందని.. ఎలాగైనా దాన్ని మోదీకి సురక్షితంగా అందిస్తానని చెప్పారు.

చాక్లెట్లు దౌత్య సంబంధాలకు చాలా మంచివి కానీ, దౌత్య ప్రయాణాలకు మాత్రం అంత మంచివి కాదని అర్థమైందని వెవర్ సరదాగా చమత్కరించారు. మొదటి ప్రపంచ యుద్ధంలో బెల్జియం తరఫున పోరాడిన భారత సైనికుల వీరత్వం, త్యాగాలను స్మరించుకునేలా ఈ చాక్లెట్ రూపొందించారు. ఇరు దేశాల మధ్య ఉన్న చారిత్రక అనుబంధానికి ప్రతీకగా దీన్ని మోదీకి అందించాలని వెవర్ ఆశించారు.

# రష్యా-ఉక్రెయిన్ యుద్ధం.. శాంతి ప్రయత్నాలకు భారత్ సిద్ధమే



రష్యా-ఉక్రెయిన్ యుద్ధానికి ముగింపు పలికేందుకు మధ్యవర్తిత్వం సహా ఎలాంటి సహాయం అందించేందుకైనా భారత్ సిద్ధంగా ఉందని విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ పేర్కొన్నారు. ఆ రెండు దేశాలు కోరితే శాంతి స్థాపనకు కృషి చేస్తామన్నారు. యుద్ధక్షేత్రంలో ఈ వివాదం పరిష్కారం కాదు అనేది భారత్ వైఖరి అని మరోసారి స్పష్టం చేశారు. సంప్రదింపులు, దౌత్యపరమైన చర్చలతోనే వీటికి ముగింపు ఉంటుందన్నారు. షాంఘై కో-ఆపరేషన్ ఆర్గనైజేషన్ సదస్సులో రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో ప్రధాని మోదీ భేటీ అయిన కొన్ని రోజులకే విదేశాంగ మంత్రి ఈ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది.

ప్రస్తుతం ఉక్రెయిన్ పర్యటనలో ఉన్న ఎస్ జైశంకర్.. ఆ దేశ విదేశాంగ మంత్రితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వాణిజ్య నౌకలపై ఇటీవల జరుగుతున్న దాడులు, నల్ల సముద్రంలో భద్రతా పరిస్థితులపై ఇరువురు నేతలు చర్చించారు. ఈ సందర్భంగా భారత నావికులపై జరుగుతున్న దాడులపై జైశంకర్ ఆందోళన వ్యక్తం చేసినట్లు సమాచారం. ఇదిలాఉంటే, మూడు రోజుల పర్యటనలో భాగంగా విదేశాంగ మంత్రి జైశంకర్ సెప్టెంబర్ 3 నుంచి 5వ తేదీ వరకు ఉక్రెయిన్, పోలాండ్‌లలో పర్యటించనున్నారు. ద్వైపాక్షిక సంబంధాల బలోపేతం.. ప్రాంతీయ, అంతర్జాతీయ భద్రతా పరిస్థితులపై ఆయా దేశాల దౌత్యవేత్తలతో చర్చించనున్నారు.

# బౌద్ధ సన్యాసిగా మారేందుకు.. రూ.47 కోట్ల కంపెనీ అమ్మకానికి!



థాయ్‌లాండ్‌కు చెందిన ఓ వ్యాపారవేత్త అనూహ్య నిర్ణయం తీసుకున్నారు. బౌద్ధ సన్యాసిగా మారే ప్రణాళికల్లో భాగంగా తన ఐస్‌క్రీమ్ కంపెనీని రూ.47 కోట్లకు అమ్మకానికి పెట్టారు. కొనుగోలుదారుని పరిచయం చేసిన వారికీ సుమారు రూ.1.4 కోట్లు ఫీజుగా చెల్లిస్తానని ఆయన ప్రకటించినట్లు స్థానిక మీడియా తెలిపింది. సిరిపాంగ్ అకారశ్రీయుక్ అనే వ్యాపారవేత్త 1999లో 'హావెల్స్' పేరుతో ఐస్‌క్రీమ్ కంపెనీని స్థాపించారు. ఒకప్పుడు ఎంతో పేరు పొందిన ఈ బ్రాండ్.. పోటీ మార్కెట్ వంటి కారణాలతో వెనుకబడిపోయింది.

ఈ క్రమంలోనే సంసార జీవితాన్ని విడిచిపెట్టేందుకు సిద్ధమవుతున్నట్లు సిరిపాంగ్ ఇటీవల ప్రకటించారు. బౌద్ధ సన్యాసిగా మారాలని 15 ఏళ్లుగా ప్రణాళిక వేసుకుంటున్నట్లుగా చెప్పారు. దీనికి ఇంకా రెండేళ్ల సమయం ఉందని.. ఆ లోపు ఓ ఆశ్రమాన్ని స్థాపించి, అక్కడ తాను ధ్యాన సాధన చేస్తానని చెప్పారు. జ్ఞానోదయం పొందడం కోసం ఆధ్యాత్మిక సాధనకు తనను తాను అంకితం చేసుకోవడమే దీర్ఘకాలిక లక్ష్యమని వెల్లడించారు. ఆయన బౌద్ధమతంపై అనేక రచనలు చేశారు. బుద్ధుని బోధనలపై ప్రసంగాలూ ఇచ్చారు.

# పదేళ్ల కిందటే మోదీ ఏఐ గురించి మాట్లాడారు: ఎన్విడియా సీఈవో



ప్రధాని నరేంద్ర మోదీ దశాబ్దం క్రితమే దూరదృష్టితో ఆలోచించి ఏఐ గురించి మాట్లాడారని ఎన్విడియా సీఈఓ జెన్సన్ హువాంగ్ అన్నారు. ప్రపంచ ఐటీ రంగంలో భారత్ తిరుగులేని శక్తిగా ఎదిగిందని.. ఇప్పుడు ఏఐ రూపంలో కొత్త టెక్నాలజీ వైపు దూసుకుపోతోందన్నారు. భారతీయ కంపెనీలు, స్టార్టప్‌లు ఏఐ సాంకేతికతను మరింతగా అందిపుచ్చుకోవడంతోపాటు.. దాని అభివృద్ధిలోనూ భాగస్వాములు కావాలని ఆయన ఆకాంక్షించారు. బలమైన ఏఐ ఆర్థిక వ్యవస్థను నిర్మించేందుకు భారత్‌కు చాలా మంచి అవకాశాలు ఉన్నాయని హువాంగ్ తెలిపారు. నార్త్ కరోలినాలోని చాపెల్ హిల్‌లో జీ20 ఇన్నోవేషన్ మినిస్టీరియల్ సమావేశం సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఏఐ అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతోందని.. అందుకనుగుణంగా దేశాలు మరింత వేగంగా ముందుకు సాగాలని హువాంగ్ సూచించారు. ఈ ఏడాది స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో ప్రధాని మోదీ.. కోటి మంది యువతకు ఏఐ నైపుణ్య శిక్షణ ఇవ్వనున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. హువాంగ్ 2023లో భారత్‌లో పర్యటించినప్పుడూ ప్రపంచంలో ఇండియా అతిపెద్ద ఏఐ హబ్‌గా ఎదగాలని ఆకాంక్షించారు.

# పైన పటారం లోన లొటారం

# అప్పుల ఊబి లో అమెరికా ఆర్థిక వ్యవస్థ

**శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్**

- అమెరికా ఒక మెరుపుల లోకం
- అమెరికా అంటే ఒక ఆకర్షణ
- అమెరికా ఒక భూలోక స్వర్గం

- ఈ భూలోక స్వర్గం అమెరికా అప్పులు ఎంతో తెలుసా?.. 40 ట్రిలియన్ డాలర్స్. అంటే భారత దేశ కరెన్సీ ప్రకారం 3,783 లక్షల కోట్ల రూపాయలు.

**భారత దేశ అప్పులు 201.17 లక్షల కోట్ల రూపాయలు.**

- భారతదేశం ఆదాయం చిన్నది. కాబట్టి అప్పులు కూడా చిన్నవే.అమెరికా ఆదాయం పెద్దది. అప్పులు మాత్రం ఆదాయం కంటే చాలా చాలా అధికం.

- ప్రపంచ దేశాలను గుప్పిట పట్టుకున్న అమెరికా ఆర్థిక పరిస్థితి ఇప్పుడు గందరగోళానికి గురవుతున్నది . అమెరికా లోటు బడ్జెట్ ఆదేశాన్ని ముంచబోతున్నది.

**ఏ నిమిషానికి ఏమి జరుగునో ఎవరూహించెదరు?**

- ఒక దేశంలోని మనుషులు ఆదేశ ఆర్థిక వ్యవస్థకు ప్రభావితమవుతూ ఉంటారు.

అప్పు చెయ్యడం తప్పు కాదు. కానీ ఖర్చులకు మించి అప్పు చేయడం ముప్పుగా మారుతుంది.

**ఇప్పుడు అమెరికా పరిస్థితి అలాగే ఉంది.**

**దేశాల అప్పులు**

ఒక సాధారణ వ్యాపారవేత్త తన వ్యాపారాన్ని విస్తరించడానికి వడ్డీ రేటు కంటే ఎక్కువ ఆదాయం వస్తుందనే నమ్మకంతో అప్పు తీసుకున్నట్టే, దేశాలు కూడా తమ ఆర్థిక వృద్ధి కోసం అప్పులు చేస్తుంటాయి.

అమెరికా కూడా అప్పుడు చేసింది. ఎంతగా అంటే ప్రపంచంలోనే దేశాలు అన్నిటికంటే ఎక్కువగా.

- అమెరికా ఇంతటి భారీ అప్పుల్లో కూరుకుపోవడానికి కారణాలు?

**చారిత్రక కారణాలు**

మోడర్న్ టైమ్స్‌లో అమెరికాకు అప్పుల సమస్య ముందు నుంచీ ఉన్నప్పటికీ, గతంలో ఇంత పెద్ద మొత్తంలో లేదు.

**ప్రభుత్వాల వైఫల్యం**

జో బైడెన్ మరియు డోనాల్డ్ ట్రంప్ ప్రభుత్వాల హయాంలో ఈ అప్పుల భారం భారీగా రెట్టింపు అయింది

**ఆర్థిక సంక్షోభాలు**

2008 నాటి ప్రపంచ ఆర్థిక సంక్షోభం (Global Financial Crisis) అలాగే కోవిడ్-19 సమయాల్లో నష్టాలను పూడ్చుకోవడానికి అమెరికా విపరీతంగా అప్పులు చేయాల్సి వచ్చింది.

**అంతర్గత ఖర్చులు**

అమెరికా తన పౌరులకు అందించే ఉచిత సామాజిక భద్రతా పథకాలు (Social Security Policies), ఉచిత ఆరోగ్య సేవలు, సీనియర్ సిటిజన్స్ పెన్షన్లు, విపరీతమైన రక్షణ రంగ (Defense) బడ్జెట్ మరియు మౌలిక సదుపాయాల కల్పన కోసం విపరీతంగా ఖర్చు చేస్తోంది.

**వడ్డీల భారం**

ఈ 40 ట్రిలియన్ డాలర్ల అప్పుకు ప్రతి ఏటా చెల్లించాల్సిన వడ్డీల రూపంలోనే అమెరికా బడ్జెట్ నుండి భారీగా నిధులు తరలిపోతున్నాయి.

**పెట్రో డాలర్ వ్యూహం**

అమెరికా చాలా తెలివిగా డాలర్‌ను అంతర్జాతీయ రిజర్వ్ కరెన్సీగా మార్చింది.

సౌదీ అరేబియా, యూఏఈ వంటి మిడిల్ ఈస్ట్ దేశాలు ఆయిల్ వ్యాపారాన్ని కేవలం డాలర్లలోనే జరపాలని అమెరికా ఒప్పందం కుదుర్చుకుంది.

- **ఆయిల్ అమ్మగా మిగిలిన అదనపు డాలర్లను తిరిగి బాండ్ల రూపంలో అమెరికా తనకే అప్పుగా ఇచ్చేలా ఆయా దేశాలను ఒప్పించింది. జపాన్, చైనా, సౌదీ, యూఏఈ వంటి దేశాల నుండి అమెరికా దాదాపు 10 నుండి 12 ట్రిలియన్ డాలర్ల వరకు సావరన్ లోన్ (Sovereign Loan) తీసుకుంది.**

**డెఫిసిట్ ఫైనాన్సింగ్**

- **డాలర్ పతనం**

అమెరికా తన అప్పులను తీర్చడానికి డెఫిసిట్ ఫైనాన్సింగ్ పద్ధతి ద్వారా సొంతంగా డాలర్లను ప్రింట్ చేసి అప్పులు తీర్చగలదు. కానీ అలా చేస్తే ప్రపంచ మార్కెట్‌లో డాలర్ల సప్లై విపరీతంగా పెరిగిపోయి దాని విలువ దారుణంగా పడిపోతుంది.

- **డాలర్ విలువ పడిపోతుందని తెలిస్తే ఇతర దేశాలు తమ వద్ద ఉన్న ఫారెక్స్ రిజర్వ్ డాలర్లను మార్కెట్లోకి వదిలించుకోవడం (Dump) ప్రారంభిస్తాయి. దీనివల్ల ప్రపంచ**




**ఆర్థిక వ్యవస్థ పూర్తిగా కొలాప్స్ అవుతుంది.**

అప్పుడు అంతర్జాతీయ మార్కెట్లో డాలర్ స్థానాన్ని చైనాకు చెందిన యువాన్ ..Yuan భర్తీ చేసే అవకాశం ఉంటుంది. ప్రపంచాన్ని కంట్రోల్ చేసే శక్తిని కోల్పోవడం అమెరికాకు అస్సలు ఇష్టం ఉండదు కాబట్టి అది ఈ రిస్క్ తీసుకోలేదు.

**భారత్ VS అమెరికా**

**అమెరికా పరిస్థితి**

ప్రస్తుతం అమెరికా జీడీపీ (GDP) సుమారు $30 Trillion డాలర్లు కాగా, దాని అప్పు $40 Trillion డాలర్లుగా ఉంది. దీని ప్రకారం అమెరికా GDP to Debt Ratio దాదాపు 125% గా ఉండి అత్యంత ప్రమాదకర స్థితిలో ఉంది.

**భారత్ పరిస్థితి**

భారతదేశం చిన్న ఎకానమీ సుమారుగా 4 ట్రిలియన్ డాలర్లు అయినప్పటికీ ఆర్థికంగా చాలా బలంగా ఉంది. మన దేశ GDP to Debt Ratio కేవలం 58% మాత్రమే ఉంది.

- **ఈ రేషియో ఎక్కువైతే ఏమవుతుంది?**

ప్రపంచ బ్యాంక్ (World Bank) అధ్యయనాల ప్రకారం, ఒక దేశం యొక్క GDP to Debt Ratio 77% కంటే ఎక్కువ కాలం దాటి ఉంటే, ఆ దేశ ఆర్థిక వృద్ధి మందగిస్తుంది. అప్పులు మరీ ఎక్కువైతే దేశం దివాలా తీసే (Default) ప్రమాదం కూడా ఉంటుంది.

GDP to Debt Ratio (జీడీపీ-అప్పుల నిష్పత్తి) అంటే ఒక దేశం యొక్క మొత్తం అప్పును (Debt), ఆ దేశం ఒక సంవత్సరంలో ఉత్పత్తి చేసే మొత్తం వస్తువులు మరియు సేవల విలువతో (GDP - Gross Domestic Product) పోల్చి చూసే ఒక ఆర్థిక కొలమానం.

సాధారణ భాషలో చెప్పాలంటే, ఒక వ్యక్తి సంపాదనకు మరియు అతను చేసిన అప్పుకు ఉన్న తేడాను ఇది తెలియజేస్తుంది.

దీనిని క్రింది ముఖ్యాంశాల ద్వారా సులభంగా అర్థం చేసుకోవచ్చు:

- **ఇది ఎలా లెక్కిస్తారు?**

దీనిని శాతం రూపంలో వ్యక్తపరుస్తారు.దీని ఫార్ములా ఏమిటంటే.. +ణూా శీ ణవవ్ ఫ్అశీ ఉంటే మొత్తం దేశీయ మరియు అంతర్జాతీయ అప్పులు అని అర్థం.

మొత్తం GDP × 100.

**భారతదేశం ఉదాహరణ**

- **ఒక దేశం ఆదాయం GDP 100 రూపాయలు ఉండి.. దేశం చేసిన అప్పు 58 రూపాయలు ఉంటే, అప్పుడు ఆ దేశ GDP, Debt Ratio 58% అవుతుంది.**

**అమెరికా ఉదాహరణ**

- **ఒక దేశం ఆదాయం GDP 100 రూపాయలు ఉండి, ఆ దేశం చేసిన అప్పు 125 రూపాయలు ఉంటే, అప్పుడు ఆ దేశ GDP, Debt Ratio 125% అవుతుంది. అంటే ఆదాయం కంటే అప్పులే ఎక్కువగా ఉన్నాయని అర్థం.**

ఈ రేషియో ప్రాముఖ్యత ఏమిటి? ఒక దేశం తన అప్పులను ఎంతవరకు సులభంగా తిరిగి చెల్లించగలదో ఈ నిష్పత్తి తెలియజేస్తుంది. ఈ నిష్పత్తి ఎంత తక్కువగా ఉంటే ఆ దేశ ఆర్థిక వ్యవస్థ అంత బలంగా, స్థిరంగా ఉన్నట్లు లెక్క.

- ఈ రేషియో తక్కువగా ఉన్న దేశాలలో పెట్టుబడులు పెట్టడానికి అంతర్జాతీయ సంస్థలు World Bank, IMF మరియు ఇతర దేశాలు ఎక్కువ ఆసక్తి చూపిస్తాయి.

ప్రపంచ పెద్దన్నగా వెలగడానికి అప్పుచేసి షోకులు చేస్తున్న అమెరికా ఆర్థిక వ్యవస్థ ఒక నీటి బుడగ లాగా తయారయింది.

ఒక భోగ దేశంగా పరిణామం చెందిన అమెరికా ప్రజలు కూడా వినిమయ జీవితానికి అలవాటు పడ్డారు. ఈ వినిమయంతో లగ్జరీ జీవితం చూసి ప్రపంచం కూడా మాయలో పడింది.

- భారతీయులు పొదుపరులు. కానీ భారతదేశంలో కూడా సరళీకృత ఆర్థిక విధానం వచ్చిన తర్వాత ప్రజలు కూడా ఈ వినిమయ సంస్కృతికి అలవాటు పడుతున్నారు. క్రెడిట్ కార్డులు, పర్సనల్ లోన్లు అంటూ ఆర్థిక సంస్థలు ప్రజలను అప్పుల ఊబిలోనికి దించుతున్నాయి.

బంగారు లేడి లాంటి మెరుపులకు దూరంగా ఉండగలిగే జీవన సంస్కృతి భారతదేశంలో ఉంది.

- ప్రభుత్వాలు ఉత్తుత్తి ఉదారవాద వైఖరిని అదుపులో ఉంచగలిగే మార్పుని తీసుకురావాలి.అప్పుడు ప్రజలందరూ అప్పులు లేని సుఖసంతోష జీవితాలను గడుపుతారు. దాని అర్థం దేశం కూడా సుభిక్షంగా ఉంటుంది.

- అమెరికా ఇకనైనా బుద్ధి తెచ్చుకుని అనవసరమైన యుద్ధాలపై ఖర్చు పెట్టడం తగ్గించుకోకపోతే, ఆ దేశ ఆర్థిక వ్యవస్థ మరింత సంక్షోభంలోకి వెళ్లడం ఖాయమని వీడియోలో స్పష్టం చేశారు.

మన భారతదేశ ఆర్థిక వ్యవస్థ లోని పొదుపుదనాన్ని ప్రభుత్వాలు కచ్చితంగా పాటించాలి. ఒక మనిషి ఒక కుటుంబం భవిష్యత్తు కొరకు పొదుపు చేసే ప్రతి పైసా భవిష్యత్తుకు భరోసానిస్తుంది. ఒక కుటుంబ బడ్జెట్ లాగా మన భారత బడ్జెట్ కూడా భద్రత ఇచ్చేదిగా ఉండాలని కోరుకోవాలి. ఆ దిశలో ప్రభుత్వాలు ప్రజలను ఎడ్యుకేట్ చేయాలి.

**భారత్ మాతాకీ జై**

## ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలు విడుదల చేయించాలని కోరుట్ల ఎమ్మెల్యేకు వినతి



**గాజెంగి మహేశ్వర్, కరపత్రం ప్రతినిధి**

కోరుట్ల నియోజకవర్గంలోని ప్రైవేట్ డిగ్రీ కళాశాలల యాజమాన్యాల ప్రతినిధులు గురువారం మెట్ పల్లిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కోరుట్ల ఎమ్మెల్యేను కలిసి తమ సమస్యలను వివరించారు. తెలంగాణ రాష్ట్రంలోని ప్రైవేట్ డిగ్రీ కళాశాలలకు ప్రభుత్వం నుంచి రావాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు సకాలంలో విడుదల కాకపోవడంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వారు తెలిపారు. సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి, పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

## డిస్టెన్స్ డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

**గాజెంగి మహేశ్వర్, కరపత్రం ప్రతినిధి**




కోరుట్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డాక్టర్ బి. ఆర్. అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ (BRAOU) డిస్టెన్స్ ఎడ్యుకేషన్ ద్వారా బీఏ, బీకాం, బీఎస్సీ డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. ఉన్నత విద్యను కొనసాగించాలనుకునే విద్యార్థులు, నిరుద్యోగ యువత, ఉద్యోగులు, గృహిణులు, డిగ్రీని మధ్యలో ఆపివేసినవారు, రెగ్యులర్ కళాశాలకు రాలేనివారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవచ్చు. దరఖాస్తు చేసుకోవడానికి ఈ నెల 9వ తేదీ చివరి గడువు. మరిన్ని వివరాలకు 79818 74978 నంబర్‌లో

## పూడూరు కిష్టాపూర్ లో బిఆర్ఎస్ ధర్నా

**కరుణాకర్ మల్లిగారి, కరపత్రం ప్రతినిధి**

డివిజన్లో రైతు సేవా సహకార కార్యాలయం ఎదుట బీఆర్ఎస్ నాయకులు ధర్నా నిర్వహించి, ప్రభుత్వం రైతులను ఇబ్బందులకు గురిచేస్తోందని మండిపడ్డారు. అలాగే మరికొన్ని నియోజకవర్గాల్లో మాజీ మంత్రి మల్లారెడ్డి ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు జరిగాయి.

మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలు, రైతు విధానాలపై బీఆర్ఎస్ నిరసన కార్యక్రమాలు మొన్న సెప్టెంబర్ 2, 2026 బుధవారం నాడు జరిగాయి.

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 1,000 రోజులు పూర్తయిన సందర్భంగా, ఆరు గ్యారంటీల అమలులో వైఫల్యాలను నిరసిస్తూ రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా ఈ ధర్నాలు నిర్వహించారు.

మేడ్చల్ నియోజకవర్గంలో మల్లారెడ్డి నేతృత్వంలో ఈ నిరసనలు జరిగిన ప్రధాన ప్రాంతాల వివరాలు.



- **కీసర తహసీల్దార్ కార్యాలయం వద్ద మల్లారెడ్డి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఒక ముసలవ్వను తన భుజాలపై ఎత్తుకుని వినూత్న రీతిలో ప్రభుత్వ వైఫల్యాలకు వ్యతిరేకంగా నిరసన తెలిపి అందరి దృష్టిని ఆకర్షించారు.**

మేడ్చల్ నియోజకవర్గ పరిధిలోని నాగారం డివిజన్ మరియు ఘటకేసర్ టౌన్ లలో భారీ ఎత్తున నిరసన ప్రదర్శనలు చేపట్టారు.



మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా పరిధిలోని మేడిపల్లి, బొడుప్పల్ మరియు పీర్జాదిగూడ ప్రాంతాల్లో జరిగిన ఆందోళనల్లో మల్లారెడ్డి పాల్గొన్నారు. ముఖ్యంగా పీర్జాదిగూడలో జరిగిన నిరసనలో ఆయన వేసిన మాస్ స్టెప్పులు (డాన్స్) సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి.

ఈ సందర్భంగా జరిగిన బహిరంగ సభలలో మల్లారెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కిందని, రైతుబంధు, రైతుబీమా వంటి పథకాలను సరిగ్గా అమలు చేయకుండా రైతుల కళ్లల్లో కన్నీళ్లు పెట్టిస్తోందని మండిపడ్డారు.

## న్యాయవాదులకు హెల్త్ కార్డుల పంపిణీ

**గాజెంగి మహేశ్వర్, కరపత్రం ప్రతినిధి**

మెట్‌పల్లి కోర్ట్ బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఏలేటి రాంరెడ్డి తెలంగాణ అడ్వకేట్ వెల్ఫేర్ ట్రస్ట్ రెన్యూవల్ చేసిన హెల్త్ కార్డులను న్యాయవాదులకు గురువారం పంపిణీ చేశారు. ఈ కార్డులు న్యాయవాదులకే కాకుండా వారి కుటుంబ సభ్యులకు కూడా ఉపయోగపడతాయని ఆయన తెలిపారు. నూతన బార్ కౌన్సిల్ సభ్యులు కొలువుదీరాక, హెల్త్ కార్డ్స్ లేని న్యాయవాదులకు కూడా కార్డ్స్ జారీ చేయడానికి కృషి చేస్తానని రాంరెడ్డి పేర్కొన్నారు.



# లయోలా అకాడమీ విద్యార్థుల లహరి’ వృద్ధాశ్రమ సందర్శన

**కరుణాకర్ మల్లిగారి, కరపత్రం ప్రతినిధి**
సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా ఆల్వాల్‌లోని లయోలా అకాడమీ డిగ్రీ & పి.జి కళాశాలకు చెందిన బి.కామ్ (స్ట్రాటజిక్ ఫైనాన్స్) విద్యార్థులు గురువారం రంగారెడ్డి జిల్లా నర్రపల్లిలోని ‘లహరి’ వృద్ధాశ్రమాన్ని సందర్శించారు. కళాశాల ప్లానెట్ – ఔట్ రీచ్ కార్యక్రమం ఆధ్వర్యంలో, ప్రిన్సిపాల్ ఫాదర్ డాక్టర్ ఎన్.బి.బాబు గారి నాయకత్వంలో, కరస్పాండెంట్ ఫాదర్ రెక్స్ ఏంజెలియో, వైస్ ప్రిన్సిపాల్ ఫాదర్ బి.పీటర్ గారి మార్గదర్శకత్వంలో ఈ అవగాహన పర్యటన జరిగింది.

ఈ కార్యక్రమం ఆశ్రమ డైరెక్టర్ శ్రీమతి రాధిక గారి పరిచయ ప్రసంగంతో ప్రారంభమైంది.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, అనాథ వృద్ధులు ఎదుర్కొంటున్న జీవిత సవాళ్లు, వారి దీనస్థితిని విద్యార్థులకు వివరించారు.

అనంతరం శ్రీ స్టీఫెన్ ఆశీర్వాదం గారు విద్యార్థులను



ఉద్దేశించి ప్రేరణాత్మక సందేశాన్ని ఇచ్చారు.

ఈ పర్యటనలో భాగంగా విద్యార్థులు ఆశ్రమంలోని పురుషుల, మహిళల విభాగాలను సందర్శించి, అక్కడ నివసిస్తున్న వృద్ధులతో వ్యక్తిగతంగా మాట్లాడారు.

వారి జీవితానుభవాలను, వారు ఎదుర్కొంటున్న కష్టాలను అడిగి తెలుసుకున్నారు.

ఆశ్రమంలోని వారిలో చాలామంది సంపన్న కుటుంబాలకు చెందినవారైనప్పటికీ, కన్నపిల్లల నిర్లక్ష్యానికి గురై ఇక్కడ ఆశ్రయం పొందడం అందరినీ



కలచివేసింది.

- మరికొందరు వికలాంగులు, పక్షవాత బాధితులు, మంచానికే పరిమితమైన వృద్ధులు నిరంతర సంరక్షణలో ఉన్న తీరును విద్యార్థులు గమనించారు.

వృద్ధులతో సాగిన ఈ ముఖాముఖి సంభాషణలు విద్యార్థులను ఎంతగానో కదిలించడమే కాకుండా, సమాజం పట్ల వారిలో బాధ్యతను పెంచేలా చేశాయి.

# కాజీపేటలో నేడు ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి మహోత్సవాలు

- సెప్టెంబర్ 4 నుంచి 12 వరకు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ

**కరపత్రం ప్రతినిది కాజీపేట, సెప్టెంబర్ 3**
ప్రబోధ సేవా సమితి–ఇందు జ్ఞాన వేదిక, జమ్మికుంట శాఖ ఆధ్వర్యంలో కాజీపేటలోని రైల్వే క్వార్టర్స్ (రైల్వే స్టేషన్ సమీపంలో) సెప్టెంబర్ 4 నుంచి 12 వరకు శ్రీకృష్ణ జన్మాష్టమి మహోత్సవాలను వైభవంగా నిర్వహించనున్నట్లు కమిటీ అధ్యక్షుడు వెంకటాచార్యులు తెలిపారు. ఉత్సవాల సందర్భంగా ప్రతి రోజూ ఉదయం, సాయంత్రం శ్రీకృష్ణ పరమాత్మ గొప్పతనాన్ని వివరిస్తూ , భగవద్గీత లో దేవుడు




చెప్పిన జ్ఞాన విషయాలను తెలియచేయడం మరియు చిన్నారులకు భగవద్గీత శ్లోకాల పోటీలు, సంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. శ్రీకృష్ణుడు బోధించిన భగవద్గీత సందేశం, ధర్మం, కర్తవ్యబోధను నేటి తరానికి చేరవేయడమే ఈ మహోత్సవాల ముఖ్య ఉద్దేశమని వెంకటాచార్యులు తెలిపారు. భక్తులు, జిల్లా ప్రజలు కుటుంబ సమేతంగా విచ్చేసి కార్యక్రమాల్లో పాల్గొని శ్రీకృష్ణ పరమాత్మ అనుగ్రహంతో పాటు జ్ఞానదీవెనలు పొందాలని కోరారు. ఈ మహోత్సవాల ఏర్పాట్లలో శశికాంత్ రెడ్డి, రాధిక, రాజలింగం, దివ్య, రాజు, భార్గవి, ప్రేమలత, కుమార్ తదితర కమిటీ సభ్యులు చురుకుగా పాల్గొంటున్నట్లు తెలిపారు.

# రైతు సమస్యలపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీసిన బీఆర్ఎస్

- రైతులకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేయాలి..
- రైతులకు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగుతుంది: మాజీ ఎమ్మెల్యే వొడితల సతీష్ కుమార్

**కరపత్రం ప్రతినిది బ్యూరో, సెప్టెంబర్ 3**
రాష్ట్రంలో రైతుల సమస్యలను పరిష్కరించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన ప్రతి హామీని తక్షణమే అమలు చేసి అన్నదాతలకు న్యాయం చేయాలని మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు వొడితల సతీష్ కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతు సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించే వరకు బీఆర్ఎస్ పార్టీ ప్రజల పక్షాన, రైతుల పక్షాన పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు గురువారం హుస్నాబాద్ నియోజకవర్గ కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో రైతులతో కలిసి నిర్వహించిన రైతు సదస్సులో మాజీ ఎమ్మెల్యే సతీష్ కుమార్ పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, వ్యవసాయ రంగ పరిస్థితులు, ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలుపై విస్తృతంగా చర్చించారు.
రైతే రాష్ట్రానికి వెన్నెముక అని, రైతు బాగుంటేనే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుందని సతీష్ కుమార్ అన్నారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులు అనేక సమస్యలతో సతమతమవుతున్నారని, రైతుల ఓట్లతో అధికారంలోకి వచ్చి ఇప్పుడు వారి సమస్యలను పట్టించుకోకుండా కాలయాపన చేయడం సరికాదని విమర్శించారు.
ప్రతి ఎకరానికి సంవత్సరానికి రూ.15 వేల రైతు భరోసా అందిస్తామని ఇచ్చిన హామీని ఎలాంటి వివక్ష లేకుండా ప్రతి అర్హ రైతుకు అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే రూ.2 లక్షల వరకు రైతు రుణమాఫీ అందని అర్హులైన రైతులందరికీ వెంటనే రుణమాఫీ అమలు చేసి, బ్యాంకుల చుట్టూ తిరుగుతున్న రైతులకు న్యాయం చేయాలని కోరారు. సాగు సమయంలో రైతులకు అవసరమైన యూరియా, ఎరువులు, నాణ్యమైన విత్తనాలు సకాలంలో అందుబాటులో లేక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం ముందస్తు ప్రణాళికతో వ్యవసాయ అవసరాలను తీర్చాలని, రైతులు ఇబ్బందులు పడకుండా చర్యలు చేపట్టాలని సూచించారు.
22ఏ నిషేధిత జాబితాలో వ్యవసాయ భూములు ఉండటంతో రైతులు తమ భూములను విక్రయించుకోలేక, రుణాలు పొందలేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అర్హులైన భూములను వెంటనే 22ఏ జాబితా నుంచి తొలగించి రైతులకు పూర్తి హక్కులు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హుస్నాబాద్ నియోజకవర్గ రైతుల సాగునీటి అవసరాలకు అత్యంత కీలకమైన గౌరవెల్లి ప్రాజెక్టు పనులు దాదాపు పూర్తయినప్పటికీ, మిగిలిన పనులను పూర్తి చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేసి ప్రతి ఎకరానికి సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు.
పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులు, కాలువలు, చెరువుల అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని, వ్యవసాయానికి నాణ్యమైన ఉచిత విద్యుత్‌ను నిరంతరంగా సరఫరా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించి, దళారుల దోపిడీ నుంచి వారిని రక్షించాలని ప్రభుత్వాన్ని కోరారు.
వ్యవసాయ కూలీలకు సంవత్సరానికి రూ.12 వేల ఆర్థిక సహాయం అందిస్తామని ఇచ్చిన హామీని అమలు చేయాలని, అకాల వర్షాలు, తెగుళ్లు, ప్రకృతి వైపరీత్యాల వల్ల పంటలు నష్టపోయిన రైతులకు వెంటనే నష్టపరిహారం అందించాలని ఆయన డిమాండ్ చేశారు.
రైతు భరోసా, రుణమాఫీ, 22ఏ భూముల సమస్య, గౌరవెల్లి ప్రాజెక్టు, సాగునీరు, ఉచిత విద్యుత్, ఎరువులు, విత్తనాలు, పంటలకు గిట్టుబాటు ధర, పంట నష్టపరిహారం వంటి అన్ని అంశాలపై బీఆర్ఎస్ పార్టీ నిరంతరం రైతుల పక్షాన పోరాటం కొనసాగిస్తుందని సతీష్ కుమార్ స్పష్టం చేశారు. ఈ రైతు సదస్సులో హుస్నాబాద్ నియోజకవర్గంలోని వివిధ మండలాలకు చెందిన రైతులు, బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, రైతు నాయకులు, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# డిజిటల్ క్రాప్ సర్వే విజయవంతమే రైతు ప్రయోజనాల లక్ష్యం

- తొగర్రాయిలో రైతులతో జిల్లా కలెక్టర్ చర్చ.. పంటల నమోదు ప్రక్రియపై క్షేత్రస్థాయిలో పరిశీలన

**కరపత్రం ప్రతినిది వరంగల్, సెప్టెంబర్ 3**
వ్యవసాయ రంగంలో సాంకేతికతను మరింత సమర్థంగా వినియోగిస్తూ రైతులకు ప్రభుత్వ సేవలు సులభంగా అందించాలనే లక్ష్యంతో చేపట్టిన డిజిటల్ క్రాప్ సర్వే కార్యక్రమాన్ని ప్రతి రైతు తప్పనిసరిగా వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద సూచించారు. దుగ్గొండి మండలంలోని తొగర్రాయి గ్రామాన్ని సందర్శించిన కలెక్టర్, రైతులతో ముఖాముఖి సమావేశమై పంటల నమోదు



ప్రాముఖ్యతను వివరించారు. డిజిటల్ క్రాప్ సర్వేలో నమోదైన పంట వివరాల ఆధారంగానే ప్రభుత్వ పథకాలు, పంట కొనుగోలు, మద్దతు ధర తదితర ప్రయోజనాలు రైతులకు మరింత పారదర్శకంగా అందే అవకాశం ఉంటుందని తెలిపారు. అందువల్ల ప్రతి రైతు తన సాగు చేసిన పంట వివరాలను ఖచ్చితంగా నమోదు చేయించుకోవాలని సూచించారు. ఈ
సందర్భంగా గ్రామంలో జరుగుతున్న డిజిటల్ క్రాప్ బుకింగ్ ప్రక్రియను పరిశీలించిన జిల్లా కలెక్టర్, నమోదు పనుల పురోగతిపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ప్రతి దశలో అధికారులు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో సమస్యలు ఉంటే వెంటనే పరిష్కరించాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు వ్యవసాయ సంచాలకులు, మండల వ్యవసాయ అధికారి, సాంకేతిక వ్యవసాయ అధికారి, వ్యవసాయ విస్తరణ అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# సీఎంఆర్ఎఫ్ చెక్కులతో నిరుపేదలకు భరోసా

- 11 మంది లబ్ధిదారులకు రూ.6.50 లక్షల చెక్కులు పంపిణీ చేసిన వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య

**కరపత్రం ప్రతినిది బ్యూరో,**
అనారోగ్యంతో బాధపడుతూ ఖరీదైన వైద్యం చేయించుకునే ఆర్థిక స్థోమత లేని నిరుపేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) అండగా నిలుస్తోందని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య అన్నారు. వైద్య ఖర్చులతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద కుటుంబాలకు ప్రభుత్వం సీఎంఆర్ఎఫ్ ద్వారా చేయూత అందిస్తోందని తెలిపారు. హనుమకొండ కనకదుర్గ కాలనీలోని ఎంపీ క్యాంపు కార్యాలయంలో గురువారం వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని 11 మంది లబ్ధిదారులకు మొత్తం రూ.6.50 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎంపీ డాక్టర్ కడియం కావ్య పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వరంగల్ ఎంపీ డా.కడియం కావ్య మాట్లాడుతూ.. పేద ప్రజలకు అత్యవసర







సమయంలో వైద్య సహాయం అందించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. కార్పొరేట్ ఆసుపత్రుల్లో చికిత్స చేయించుకున్నప్పటికీ ఆర్థిక ఇబ్బందులతో సతమతమయ్యే కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆర్థిక సహాయం అందించడం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. ప్రజలకు అవసరమైన సమయంలో ప్రభుత్వ సహాయం అందేలా తన వంతు కృషి చేస్తానని ఎంపీ తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆర్థిక సహాయం అందడంతో లబ్ధిదారులు ఎంపీ డాక్టర్ కడియం కావ్య గారికి కృతజ్ఞతలు తెలిపారు. వైద్య ఖర్చుల భారాన్ని తగ్గించేందుకు ప్రభుత్వం అందించిన ఈ సహాయం తమ కుటుంబాలకు ఎంతో ఊరటనిచ్చిందని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, లబ్ధిదారులు, తదితరులు పాల్గొన్నారు.

# మోసపూరిత హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్..

- వెయ్యి రోజుల పాలనలో చేసిందేమీ లేదు
- మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి



**కరపత్రం ప్రతినిది నడికూడ, సెప్టెంబర్ 3**
ఎన్నికల సమయంలో 420 మోసపూరిత హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం.. వెయ్యి రోజుల పాలనలో ప్రజలకు చేసిందేమీ లేదని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి తీవ్రస్థాయిలో విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ వెయ్యి రోజుల దగా పాలనను నిరసిస్తూ బీఆర్ఎస్ పార్టీ చేపట్టిన వారం రోజుల పోరుబాట కార్యక్రమంలో భాగంగా గురువారం రెండో రోజు నడికూడ



మండలం కొక్కొండ నుంచి నడికూడ వరకు ఎస్సారెస్పీ కాలువ వెంట రైతులతో కలిసి ట్రాక్టర్లతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా చల్లా ధర్మారెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తోందని ఆరోపించారు. ముఖ్యంగా రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. రైతు సంక్షేమం, సాగునీరు, వ్యవసాయ రంగ అభివృద్ధిపై గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని, ప్రస్తుతం రైతులు అనేక సమస్యలతో సతమతమవుతున్నారని పేర్కొన్నారు. ర్యాలీ సందర్భంగా చుట్టుపక్కల పంట పొలాల్లో వ్యవసాయ పనుల్లో నిమగ్నమైన రైతులు చల్లా ధర్మారెడ్డి రాకను గమనించి ఆయన వద్దకు వచ్చి తమ సమస్యలను వివరించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రైతులకు అందిన సహకారం, సాగునీటి వసతులతో వ్యవసాయం మెరుగ్గా సాగేదని, ప్రస్తుత ప్రభుత్వంలో పరిస్థితులు ఇబ్బందికరంగా మారాయని పలువురు రైతులు తమ ఆవేదన వ్యక్తం చేసినట్లు ఆయన తెలిపారు. రైతులను

- మోసం చేస్తే గుణపాఠం తప్పదు

దేశానికి అన్నం పెట్టే రైతులను ఇచ్చిన హామీలతో మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని చల్లా ధర్మారెడ్డి హెచ్చరించారు. రైతుల సమస్యలను పరిష్కరించే వరకు బీఆర్ఎస్ పార్టీ ప్రజల తరఫున పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా ఇచ్చిన హామీలను అమలు చేసి రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, యువజన నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీకృష్ణాష్టమి పర్వదిన శుభాకాంక్షలు తెలిపిన నవ భారతి ఈవెంట్స్ ప్రొప్రైటర్ కుక్కముడి శంకరన్న

- తెలంగాణ బ్యాండ్ వాయిద్య కళాకారుల సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కళాకారుల సంక్షేమానికి నిరంతర కృషి

**కరపత్రం ప్రతినిది హనుమకొండ, సెప్టెంబర్ 3**
శ్రీకృష్ణ జన్మాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని తెలంగాణ బ్యాండ్ వాయిద్య కళాకారుల సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, నవ భారతి ఈవెంట్స్ ప్రొప్రైటర్ కుక్కముడి శంకరన్న రాష్ట్ర ప్రజలకు, తెలంగాణ బ్యాండ్ వాయిద్య కళాకారుల బృందానికి, మిత్రులకు, శ్రేయోభిలాషులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.
ఈ సందర్భంగా శంకరన్న మాట్లాడుతూ.. శ్రీకృష్ణుని జీవితం ధర్మం, సేవాభావం, కర్తవ్య నిర్వహణకు ఆదర్శమని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ శ్రీకృష్ణుడి బోధనలను ఆచరిస్తూ సమాజంలో ప్రేమ, సౌభ్రాతృత్వం, శాంతి నెలకొల్పేందుకు కృషి చేయాలని ఆకాంక్షించారు. ప్రతి ఇంటా శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఆనందోత్సాహాల మధ్య జరగాలని




కోరుకున్నారు.తెలంగాణ బ్యాండ్ వాయిద్య కళాకారుల సంక్షేమం కోసం సంఘం ఎల్లప్పుడూ కృషి చేస్తోందని, కళాకారుల హక్కుల పరిరక్షణకు నిరంతరం పాట పడుతున్నట్లు తెలిపారు. నవ భారతి ఈవెంట్స్ ద్వారా వివాహాలు, హల్దీ వేడుకలు, సాంప్రదాయ పందిళ్లు, బ్యాండ్ వాయిద్యాలు, డీజే, హౌస్ లైటింగ్, కళాశాల మరియు కార్పొరేట్ ఈవెంట్లు సహా అన్ని రకాల వేడుకలను అత్యున్నత ప్రమాణాలతో నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. వినియోగదారుల అభిరుచికి అనుగుణంగా నాణ్యమైన సేవలను అందించడం తమ లక్ష్యమని తెలిపారు. చివరగా, శ్రీకృష్ణుని ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలందరూ ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని కుక్కముడి శంకరన్న ఆకాంక్షించారు.

# శ్రీకృష్ణాష్టమి పర్వదిన శుభాకాంక్షలు తెలిపిన కాశివొజ్జుల రమేష్

- భగవద్గీత బోధనలు ప్రపంచ మానవాళికి మార్గదర్శకం

**కరపత్రం ప్రతినిది హనుమకొండ, సెప్టెంబర్ 3**
శ్రీకృష్ణాష్టమి పర్వదినం – సెప్టెంబర్ 4 పురస్కరించుకొని హనుమకొండలోని శ్రీ సాయి వుడ్ ఫర్నిచర్ ప్రోప్రైటర్ కాశివొజ్జుల రమేష్ ఓరుగల్లు ప్రజలకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు శ్రీకృష్ణాష్టమి పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కాశివొజ్జుల రమేష్ మాట్లాడుతూ.. జగద్గురు శ్రీకృష్ణ భగవానుడు మానవాళికి ధర్మం, సత్యం, న్యాయం, కర్తవ్యనిర్వహణ, భక్తి, సేవా భావం వంటి శాశ్వత జీవన విలువలను బోధించిన మహోన్నత దైవమని పేర్కొన్నారు. భగవద్గీత ద్వారా శ్రీకృష్ణుడు అందించిన ఉపదేశాలు ప్రపంచ మానవాళికి నేటికీ ఆదర్శప్రాయమైన మార్గదర్శకాలని అన్నారు. జీవితంలో ఎలాంటి క్లిష్ట పరిస్థితులు ఎదురైనా ధైర్యాన్ని కోల్పోకుండా ధర్మబద్ధంగా ముందుకు సాగాలని, సమాజంలో ప్రేమ, పరస్పర గౌరవం, సోదరభావం, మానవతా దృక్పథంతో జీవించాలని శ్రీకృష్ణుని సందేశం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తినిస్తోందని




తెలిపారు. ప్రస్తుత సమాజంలో యువత శ్రీకృష్ణుని ఆదర్శాలను అనుసరిస్తూ నైతిక విలువలు, క్రమశిక్షణ, దేశభక్తి, సామాజిక బాధ్యతతో ముందుకు సాగితే సమాజం మరింత అభివృద్ధి చెందుతుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. కుటుంబ బంధాలను బలోపేతం చేసుకుంటూ పరస్పర సహకారం, సేవా దృక్పథంతో జీవించడం ద్వారా సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం నెలకొంటుందని అన్నారు.శ్రీకృష్ణుని దివ్య ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం, సుఖసంతోషాలు, విజయాలు చేకూరాలని మనసారా ఆకాంక్షించారు. ప్రతి ఇంటా ఆనందాలు వెల్లివిరియాలని, దేశంలో శాంతి, సుభిక్షం నెలకొనాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ రాష్ట్ర ప్రజలందరికీ శ్రీకృష్ణాష్టమి పర్వదిన శుభాకాంక్షలు తెలియజేశారు.